# 43

# విగ్రహములపై దేవుని ఆధిక్యము

## (యెషయా 46)

బేలు మరియు నెబో, బబులోను దేశనివాసుల దేవుళ్లను, ఎక్కడికైనా గాని మోపుదల వలె మోసికొనిపోవలసిన పరిస్థితి అది (1, 2 వచనాలు); కానీ ఇశ్రాయేలు ఇంటివారిలోని శేషమును జీవముగల దేవుడు మోసికొని వెళ్లాడు (3, 4 వచనాలు). అన్యుల విగ్రహములతో పోల్చినప్పుడు ఆయనకు గల విశిష్టతను నొక్కివక్కాణించుచూ దేవుడు ఒక ప్రశ్న వేసాడు (5–7 వచనాలు). తన ప్రజల పక్షముగా అవసరమైన చర్యలను చేపట్టి (8–11 వచనాలు), వారికి రక్షణ తెచ్చినవాడు దేవుడే (12, 13 వచనాలు).

### విగ్రహములను భరించుటలో గల భారము (46:1, 2)

బేలు కూలుచున్నది నెబో క్రుంగుచున్నది
వాటి ప్రతిమలు జంతువులమీదను పశువులమీదను
మోయబడుచున్నవి
మీ మోతలు సొమ్మసిల్లు పశువులకు భారముగా నున్నవి
అవి క్రుంగుచు కూలుచు నుండి ఆ బరువులను
విడిపించుకొనలేక తామే చెరలోనికి పోయియున్నవి.

"బేలు" (1 వచనం), లేక మెరోదుకు బబులోనునకు నగర–దేవుడైయుండెను. ఈయన ముఖ్యమైన దేవుడై, సర్వదేవతాగణమునకు శిరస్సై యుండెను.[1] "నెబో" వాని ముఖ్య ఆలయము ఉండిన (బబులోను నుండి పదిమైళ్ల దూరములో ఉండిన) బోరిసిప్ప నగర–దేవుడై యుండెను. ఈయన విస్తృతంగా జ్ఞానమునిచ్చుచు విజ్ఞాన శాస్త్రములను కాపాడు దేవుడుగా పూజింపబడినాడు. వాని ప్రతిమ ప్రతి సంవత్సరము సింహాసనమునధిష్ఠింప చేయబడు పండుగ సందర్భములో బబులోనుకు తీసుకురాబడినది. "నెబో" అను పేరు ఈయనకు అపాదింపబడుచున్న గౌరవమును సూచించుటకు "నెబుకద్నెజరు" మరియు "నబోనిడస్" అను నామములో చేర్చబడియున్నది.

"మీ మోతలు ... భారముగానున్నవి" అంటూ యెషయా ఉద్ఘాటించుచున్నాడు (2 వచనం). మోసికొని తీసుకెళ్లాల్సిన ఏ దేవుడైనా ఒక భారమే. ఈ అబద్ధ దేవుళ్ల ప్రతిమలకు వంగి నమస్కరించినవారికి వారు ఒక "భారము" అయ్యారు. ఏలయనగా బేలు గాని వారిని "చెర" నుండి విడిపింపలేకపోయిరి.

### భారమును భరించు దేవుడు (46:3, 4)

యాకోబు ఇంటివారలారా, ఇశ్రాయేలు ఇంటి
వారిలో శేషించినవారలారా,
గర్భమున పుట్టినది మొదలుకొని నా చేత భరింపబడినవారలారా,

తల్లి ఒడిలో కూర్చుండినది మొదలుకొని నేను చంక పెట్టుకొనినవారలారా,
నామాట ఆలకించుడి.
ముదిమి వచ్చువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే తల
వెంట్రుకలు నెరయువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే
నేనే చేసియున్నాను చంకపెట్టుకొనువాడను నేనే
నిన్ను ఎత్తికొనుచు రక్షించువాడను నేనే.

"యాకోబు ఇంటివారలారా, ఇశ్రాయేలు ఇంటివారిలో శేషించినవారలారా" అంటూ, "గర్భమున పుట్టినది మొదలుకొని నాచేత భరింపబడినవారలారా, తల్లి ఒడిలో కూర్చుండినది మొదలుకొని నేను చంకపెట్టుకొనినవారలారా" అని దేవుడు తన ప్రజలను సంభోధించుచున్నాడు (3 వచనం). ఇక్కడ, "యాకోబు ఇంటివారలారా" అని పిలిచినా, "ఇశ్రాయేలు ఇంటివారలారా" అని పిలిచినా ఇవి శేషించినవారిని వర్ణించుచున్న పర్యాయపదములై యున్నవి. విగ్రహములకు తారతమ్యముగా, దేవుడు భారమును భరించుచు విడిపించువాడనై యున్నాడు. దేవుడు ఇశ్రాయేలీయులను అరణ్య మార్గమున "ఎత్తికొని" వచ్చాడని మోషే చెప్పుచున్నాడు (ద్వితీయోపదేశకాండము 1:31). శ్రమనొందు సేవకుడు మన వ్యసనములను "వహించెను" (యెషయా 53:4). నిజముగా దేవుడు తన ప్రజలను "పూర్వ దినములన్నిటను" వారిని "ఎత్తికొనుచు మోసికొనుచు" వచ్చెను (యెషయా 63:9).

George Adam Smith ఈ అధ్యాయమునకు సంబంధించిన తన వ్యాఖ్యానమునకు "భరించుచున్నాడు లేదా భరించాడు" అను శీర్షికను పెట్టాడు. "ఒకడు తన మతము గూర్చి అది ఏదో తాను భరించాల్సిందని భావించుటనుబట్టి, లేక అది ఏదో తనను భరిస్తుందని భావించుటనుబట్టి అది వానికి ఎంత ప్రధానమైన విషయమై దాని గూర్చిన తన గ్రహింపులో వ్యత్యాసమును కలుగజేయునదై యుండునని" ఆయన రచించాడు.[2]

"ముదిమి వచ్చువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే" అని దేవుడు వాగ్దానమిచ్చున్నాడు (4 వచనం). ఆహా, ఎంత గొప్ప అభయము! ఎంత గొప్ప ఆదరణ! "నేను చిన్నవాడనై యుంటిని ఇప్పుడు ముసలివాడనై యున్నాను, అయినను నీతిమంతులు విడువబడుట గాని వాని సంతానము భిక్షమెత్తుట గాని నేను చూచియుండలేదు" అని కీర్తనకారుడు తన మనస్సులోని మాటను బయటపెట్టుచున్నాడు (కీర్తనలు 37:25); "గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను, ఏ అపాయమునకు భయపడను, నీవు నాకు తోడై యుందువు; నీ దుడ్డుకఱ్ఱయు నీ దండమును, నన్ను ఆదరించును" (కీర్తనలు 23:4).

## సాటిలేని దేవుడు (46:5-7)

మేము సమానులమని నన్ను ఎవనికి సాటిచేయుదురు?
మేము సమానులమని యెవని నాకు పోటిగా చేయుదురు?
దానికి సాగిలపడి నమస్కారము చేయుటకై
సంచినుండి బంగారము మెండుగా పోయువారును వెండి తూచువారును
దాని దేవతగా నిరూపించవలెనని కంసాలిని కూలికి పిలుతురు.
వారు భుజముమీద దాని నెక్కించుకొందురు
దాని మోసికొనిపోయి తగినచోట నిలువబెట్టుదురు
ఆ చోటు విడువకుండ అది అక్కడనే నిలుచును

ఒకడు దానికి మొఱ్ఱపెట్టినను ఉత్తరము చెప్పదు
వాని శ్రమ పోగొట్టి యెవనిని రక్షింపదు.

దేవుని పక్షమున మాట్లాడుచూ, యెషయా భావచింతనను ఉత్తేజపరచు ప్రశ్న అడుగుచున్నాడు: "మేము సమానులమని నన్ను ఎవనికి సాటిచేయుదురు?" (5 వచనం). "పోటిగా చేయుదురు" హెబ్రీ భాషలోని *mashal* అను మూల పదము నుండి తీసికొనబడినది, "... వలె యుండుట" లేక "పోలియుండుట" అని దీనికి అర్థము.[3] దేవుడు ఏ విగ్రహమువలెనైనను ఉండడు. వాటిలో ఏదైనను ఆయనతో ఉమ్మడిగా దేనినైనను కలిగియుండదు.

విగ్రహారాధన గూర్చి తన వివాదాత్మక తర్కమును యెషయా కొనసాగించుచున్నాడు (40:18–20; 44:9–20 చూడుము). విలువైన వెండి బంగారములతో చేయబడినదైనను, ఒక విగ్రహము దానిని పూజించుచుండినవాడు మొఱ్ఱపెట్టినను అది వానికి "ఉత్తరము చెప్పదు" లేక "వాని శ్రమ పోగొట్టి యెవనిని రక్షింపదు" అని ఆయన రుజువుచేయుచున్నాడు (6, 7 వచనాలు). ఇది మనకు ఈనాడు ఒక హెచ్చరికయై యుండవలెను. మన జీవితాలకు కేంద్రమైయున్న దేవుని స్థానమును ఆక్రమించు విగ్రహములను మనము రూపొందించుకొనకూడదు. ఏ కలిమిగాని, పరువుగాని, ఘనకార్యముగాని, లేక మరేదైనను జీవితములోని తీవ్ర వాంఛలను తృప్తిపరచజాలదు. మనము వీటి వెంటబడివెళ్లినట్లయితే, మనము – పూర్వకాల సొలొమోను వలె – చివరకు, "... అవన్నియు వ్యర్థమైనవిగాను ఒకడు గాలికి ప్రయాసపడినట్టుగాను అగుపడను, సూర్యుని క్రింద లాభకరమైనదేదియు లేనట్టు నాకు కనబడెను" అని చెప్పవలసి యుండును (ప్రసంగి 2:11).

## కార్యములు చేయు దేవుడు (46:8–11)

దీని జ్ఞాపకము చేసికొని ధైర్యముగా నుండుడి
అతిక్రమము చేయువారలారా, దీని ఆలోచించుడి
చాల పూర్వమున జరిగినవాటిని జ్ఞాపకము చేసికొనుడి
దేవుడను నేనే మరి ఏ దేవుడును లేడు
నేను దేవుడను నన్ను పోలినవాడెవడును లేడు.
నా ఆలోచన నిలుచుననియు నా చిత్తమంతయు
    నెరవేర్చుకొనెదననియు చెప్పుకొనుచు
ఆదినుండి నేనే కలుగబోవువాటిని తెలియజేయుచున్నాను.
పూర్వకాలమునుండి నేనే యింక జరుగనివాటిని తెలియజేయుచున్నాను.
తూర్పునుండి క్రూరపక్షిని రప్పించుచున్నాను
దూరదేశమునుండి నేను యోచించిన కార్యమును
    నెరవేర్చువానిని పిలుచుచున్నాను
నేను చెప్పియున్నాను దాని నెరవేర్చెదను
ఉద్దేశించియున్నాను సఫలపరచెదను.

మరొక పర్యాయము (44:21 వలెనే) తన ప్రజలు "జ్ఞాపకము చేసికొనవలెనని" దేవుడు వారికి పిలుపునిచ్చుచున్నాడు (8, 9 వచనాలు). అపనమ్మకమునకు పరిష్కారము జ్ఞాపకముంచుకొనుట అని John N. Oswalt చెప్పాడు.[4] దేవుడు ఇశ్రాయేలీయులు మరియు

మొదటి శతాబ్దములో హింసింపబడిన క్రైస్తవుల యెడల చూపిన ఆయన ప్రేమపూర్వకమైన శ్రద్ధను జ్ఞాపకమునకు తెచ్చుకొని ధైర్యమును కూడగట్టుకొనవలెను. దేవుడు మన జీవితాల్లో మన యెడల చూపించు తన కటాక్షము గూర్చి యోచించుచు మనము ఆయనకు కృతజ్ఞత వందనములు తెలియజెప్పుకొనవలెను. మనము ఒక్కసారి మన గత జీవితాలను సింహావలోకనము చేసికొన్నప్పుడే మన జీవితాల్లో సంభవించిన ప్రతి సంభవము వెనుక దేవుని హస్తముండినదని మనము అర్థంచేసికొనగలమని ఒకసారి దైవభక్తిగల ఒక వ్యాపారవేత్త నాతో అన్నాడు. నిశ్చయంగా, తన తండ్రి మరణించిన పిదప భయముతో వణకుచుండిన తన సహోదరులను ఆదరించిన యోసేపు విషయంలో జరిగింది కూడ సరిగ్గా ఇదే:

> యోసేపు – భయపడకుడి, నేను దేవుని స్థానమందున్నానా? మీరు నాకు కీడుచేయ నుద్దే–శింతిరి గాని నేటిదినమున జరుగుచున్నట్లు, అనగా బహు ప్రజలను బ్రదికించినట్లుగా అది మేలుకే దేవుడు ఉద్దేశించెను. కాబట్టి భయపడకుడి, నేను మిమ్మును మీ పిల్లలను పోషించెదనని చెప్పి వారిని ఆదరించి వారితో ప్రీతిగా మాటలాడెను (ఆదికాండము 50:19–21).

ఆయన ముందుగానే తెలియజేసిన సంగతులకు సంబంధించినంత వరకు దేవుడు తానను‌గ్రహించుచుండిన అభయమును తెలియజేయు మాటలు 10 మరియు 11 వచనములలో మరి ఎక్కువగా ఉన్నవి: “నేను చెప్పియున్నాను; దాని నెరవేర్చుదును. ఉద్దేశించియున్నాను, సఫలపరచెదను.” తన చిత్తమును సాధించుటకు ఆయన “[తన] ఉద్దేశమలో ఉండినవానిని” అది వరకే ఏర్పరచుకొన్నాను. కోరెషు, “తూర్పు నుండి వచ్చు క్రూర పక్షి” తన విజయముల ద్వారా యూదులకు విడదల కలగుజేయును.

“ఇక్కడ వాగ్దానమునకును నిర్వర్తనకును మధ్య, దైవీకమైన ప్రసంగమునకును దైవీకమైన చర్యకును మధ్య గల నిశ్చలమైన అనుసంధానము మనకు కనబడుచున్నది.”[5] దేవుడు ఏమేమి చేసాడో, ఏమేమి చేయుచున్నాడో. ఏమేమి చేయనైయున్నాడో మొదలైన వివరములను చూపించుటకు ఈ వచనముల గమనము “అందరికీ/అన్నింటికి సంబంధించిన విషయము” నుండి “నిర్దిష్టమైన విషయము” వైపు మళ్లుచున్నది.[6] “ఆయన సకల కాలములయందును సకల స్థలములయందును ఎడతెరపిలేకుండా చేయుచున్నవాటినిబట్టి వారు దేవుని గుర్తించుచున్నారు.”[7] నాలుగు ఉత్తమ పురుష క్రియా పదములతోకూడ హెబ్రీ సముచ్ఛయము '*ap* మూడు పర్యాయములు వచ్చుట ద్వారా ఈ ఆలోచన నొక్కి చెప్పబడుచున్నది: “నేను చెప్పియున్నాను; దాని నెరవేర్చుదును. ఉద్దేశించియున్నాను, సఫలపరచెదను.” “నీవు సమస్త క్రియలను చేయగలవనియు, నీవు ఉద్దేశించినది ఏదియు నిష్ఫలము కానేరదనియు, నేనిప్పుడు తెలిసికొంటిని” (42:2) అని యోబుతో కూడా (మనమిప్పుడు చేయుచున్నట్లు) ఇశ్రాయేలు ఒప్పుకొనవలసిన అవసరమున్నది.

## రక్షించు దేవుడు (46:12, 13)

కఠినహృదయులై నీతికి దూరముగా ఉన్నవారలారా,
నా మాట ఆలకించుడి
నా నీతిని దగ్గరకు రప్పించియున్నాను అది దూరమున లేదు

నా రక్షణ ఆలస్యము చేయలేదు
సీయోనులో రక్షణనుండి నియమించుచున్నాను ఇశ్రాయేలునకు
నా మహిమను అనుగ్రహించుచున్నాను.

"కఠినహృదయులై యున్నారు" అని దేవుడు తన ప్రజలను చిత్రీకరించుచున్నాడు (12 వచనం). "కఠినహృదయులై యుండుట" అనగా మొండిపట్టు కలిగి యుండుట అని అర్థము. ఇటువంటి వైఖరి "నీతిమంతమునకు దూరమై," "దేవుని సన్మార్గ సంబంధమైన విషయములకు, నైతిక విషయములకు, మరియు ఆధ్యాత్మిక ప్రమాణమునకు దూరమై" యున్నట్లుగా పరిణమించును.[8]

"నీతి," "రక్షణ," మరియు "మహిమ" (13 వచనం) దేవుని నమ్ముచు, ఆయనకు విధేయులైయున్నవారికి దేవుడనుగ్రహించు వరములైయున్నవి. ఈ వరములను లోకమియ్యజాలదు, ఏలయనగా అవి దేవునిలో మాత్రమే కలవు. ప్రియ చదువరీ, నీవు దేవునికి విధేయుడవైన బిడ్డవైయున్నావా? అయ్యున్నట్లయితే, "తన మహిమనుబట్టియు గుణాతిశయమునుబట్టియు, మనలను పిలిచినవాని గూర్చిన అనుభవజ్ఞానమూలముగా, ఆయన దైవశక్తి, జీవమునకును భక్తికిని కావలసినవాటినన్నిటిని మనకు దయచేయుచున్నాడు ..." అని నీవెరుగుదువు (2 పేతురు 1:2, 3).

---

సూచనలు

[1]యెషయా 46:1 మరియు యిర్మీయా 50:2; 51:44 మాత్రమే వాని పేరును పేర్కొనుచున్నవి. [2]George Adam Smith, *The Book of Isaiah,* vol. 2, rev. ed. (New York: Harper & Brothers, 1927), 198. [3]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of the Old Testament* (Oxford: Clarendon Press, 1972), 1000. [4]John N. Oswalt, *The Book of Isaiah, Chapters 40-66,* The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1998), 235. [5]Ibid., 237. [6]మూడు హెబ్రీ అసమాపక క్రియలు: "తెలియజేయుచున్నాను," "చెప్పుకొనుచు" మరియు "రప్పించుచున్నాను" ఉపయోగింపబడుటలో ఇది కనబడుచున్నది. అసమాపక క్రియలు "అనంతకాలపు క్రియలు" అని వర్ణింపబడుచున్నవి. [7]Oswalt, 236. [8]Homer Hailey, *A Commentary on Isaiah* (Grand Rapids, Mich.: Baker Book House, 1985; reprint, Louisville, Ky.: Religious Supply, 1992), 390.

---

## వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

---

### ❖❖❖ దేవుడు భరించుచున్నాడు ❖❖❖
### (అధ్యాయం 46)

46వ అధ్యాయంలో లోకములోని అత్యంత గొప్పదైన తారతమ్యము, నిజమైన దేవునికిని బబులోను దేవతలకును మధ్యగల ఒక తారతమ్యము కలదు! బబులోనువారు సేవించుచుండిన నిర్జీవమైన విగ్రహములు వాటిని పూజించువారిచేత మోయబడవలసివచ్చినవి, కానీ భూమ్యాకాశములను సృజించిన దేవుడు ఆయనను ఆరాధించువారిని మోయునను వాస్తవము ఈ సామ్యములో ప్రధానాంశమై యున్నది. "మీ మోతలు సొమ్మసిల్లు పశువులకు

భారముగానున్నవి” అని మానవుని చేత చేయబడిన ప్రతిమల గూర్చి చెప్పబడినది (1ఎ వచనం). ఏదేమైనా, “నిన్ను [ఎత్తికొన్నాను], నిన్ను ఎత్తికొనువాడను నేనే” అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (4 వచనం). దేవుడు తన ప్రజలను ఎలా ఎత్తికొనుచున్నాడో ఒక్కసారి ఆలోచించండి.

*గర్భమున పుట్టినది మొదలుకొని ఎత్తికొనుచున్నాడు.* ఆయన మనలను ఎత్తికొని మోయుచున్నాడని మనకు ఏమియు ఎరుకలేనప్పుడు ఆయన మనలను ఎత్తికొన్నాడు. “నీవు గర్భమున పుట్టినది మొదలుకొని భరింపబడి నీవు తల్లి ఒడిలో కూర్చుండినది మొదలుకొని చంకపెట్టుకొనబడియున్నావు” అని దేవుడు యూదా గూర్చి చెప్పుచున్నాడు (3 వచనం). మనము ఆయన గూర్చి ఆలోచించుటకు సమర్థవంతులము కాకమునుపే, తన కటాక్షము చొప్పున ఆయన మన గూర్చి తగు శ్రద్ధ వహించాడు.

*జీవిత కాలమంతయు ఎత్తికొనుచున్నాడు.* ఆయన మనలను అదేపనిగా భరించుచునేయున్నాడు. సంవత్సరములు గడిచిన కొలది, మనము ఆయనకు చేరువగా ఉండుటకు నిరాకరించినప్పుడు సహితము, ఆయన మనలను ఒక కంట కనిపెట్టుచూ ఉండుట ఎన్నడును నిలిపివేయలేదు. ఆయన తన ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటున్నాడు. “ముదిమి వచ్చువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే తలవెంట్రుకలు నెరయువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే! నేనే చేసియున్నాను, చంకపెట్టుకొనువాడను నేనే; నిన్ను ఎత్తికొనుచు రక్షించువాడను నేనే” (4 వచనం).

*తన నిత్య సంకల్పమునకు పొందికగా ఎత్తికొనుచున్నాడు.* తన ప్రజలను ఎత్తికొని మోయవలెననునది మొదటి నుండి కూడ తన ప్రణాళికయై యుండినది. ఆయన మనఃకల్పిత ఉద్దేశమంతా తన ప్రజలు ఆయన జ్ఞానము, సహవాసము, విడుదల, మరియు అధికారమునందు ఆనందానుభూతి చెందుచూ ఆయనతో కూడ సహవసించుచుండవలెననునదే.

*ఆయన సిద్ధంచేసి యుంచిన భవిష్యత్తులోనికి ఎత్తికొనుచున్నాడు.* తన ప్రజలను ఎత్తికొని మోయుటలో ఆయన వేసిన భవిష్యత్ ప్రణాళిక కూడ కలిసియున్నది. ఆయన వారి గూర్చి ఈనాడు చింతించుచున్నాడు, కానీ వారి భవిష్యత్తు కొరకు మహిమాన్వితమైన రేపటిని రూపొందించియున్నాడు. ఆయన సంకల్పించుకొని దానిని సృజించాడు, గనుక ఇప్పుడు దానిని సంభవింపజేయును “నేను దేవుడను, నన్ను పోలినవాడెవడును లేడు. నా ఆలోచన నిలుచుననియు, నా చిత్తమంతయు నెరవేర్చుకొనెదననియు చెప్పుకొనుచు, ఆదినుండి నేనే కలుగబోవువాటిని తెలియజేయుచున్నాను” అని ఆయన చెప్పుచున్నాడు (9బి, 10 వచనాలు). అవసరమైనప్పుడు, ఆయన తన ప్రజల కొరకు భవిష్యత్తును సిద్ధము చేయుటకు అన్యుడైన రాజును సహితము, కోరెషును రేపినట్లుగా ఆయన రేపును (11 వచనం). “ఆదినుండి కలుగబోవువాటిని” మన దేవుడు ప్రకటించును, భవిష్యత్తు గూర్చి ఆయన మనకు తెలియజెప్పు విషయములను, మనము ధైర్యముతో నమ్మవచ్చును.

బబులోను నివాసులు వారి స్వంత దేవుళ్లను చేసికొన్నారు. వారు తమ వెండి బంగారములను శిల్పకారుల యొద్దకు తీసికొని వెళ్లి వారిచ్చిన ప్రశస్తమైన లోహములను ఒక దేవునిగా మల్చవలెనని కోరుకొన్నారు. అట్టి దేవుడు ఒకసారి రూపొందించబడిన తరువాత, వారు ఆ ప్రతిమ ముందర వంగి నమస్కకరించారు. వారు ఆ ప్రతిమను వారి భుజాలపై ఎత్తుకొని దానిని ఉండలసిన చోటికి మోసికొని వెళ్లారు. సహజంగానే, అది ప్రాణము లేనిదై

యున్నది. గనుక ఉంచబడిన చోటునుండి అది ఎన్నడూ కదలలేదు, అది మాట్లాడలేదు, లేక దానిని పూజించుచుండినవారిని దేనినుండైనను విడిపించనూ లేదు. వారు ఎంత బిగ్గరగా మొఱ్ఱపెట్టినను, ప్రయోజనమేమియు లేకపోయినది మరియు అది వారి విన్నపములకు ఎటువంటి ప్రతిస్పందనయైనను కనుపర్చలేకపోయినది.

దేవుని ప్రజలు వెనక్కు తిరిగి సింహావలోకనము చేసికొన్నట్లయితే, దేవుడు వారిని మోయుచునే యుండెనని వారు చూడగలరు. ఆయన వారిని నడిపించాడు, రక్షించాడు, మరియు వారికి సమస్తమును సమకూర్చాడు. ఆయనే దేవుడు, గనుక వేరొక దేవుడు లేడు (9 వచనం).